
# సరంగు వెంకన్న



శ్రీ లింగరాజు

రాధారీ పడవల ప్రయాణం అలవాటున్నవాళ్లు చినసామిగారి పేరువినే ఉంటారు. గోదావరిబ్రిడ్జీ కట్టక ముందు, ఇంకా రైళ్లింత సులభంకాని రోజుల్లో చినసామి గారి ప్రతిభ వేసీవెయ్యకుండా ఉండేది. రాజమహేంద్రవరం నుంచి చెన్నపట్నంవరకు అన్ని కాలువల్లోను ఆయన రాధారీ పడవలు నడుస్తూ ఉండేవి. అప్పట్లో ఆయనే పెద్ద పడవల సాహుకారు. ఈరోజుల్లో పి. అండ్. ఓ. స్టీమరు కంపెనీ ప్రెసిడెంటు కెంతపలుకుబడుందో ఆకాలంలో ఆయన కంత పలుకుబడుండేది. అప్పట్లో ఆయనపేరు తెలుగుదేశమంతా వ్యాపించింది. ఇంతపలుకుబడికీ కారణం ఆయన కేవలం, పడవల సాహుకారవడంచేతనే కాదు. ధర్మాత్ముడు. దీనులంటే హృదయపూర్వకంగా ప్రేమించే సుస్వభావం కలవాడు. కాశీనుంచి రామేశ్వరానికెళ్లే బావాజీలకు రాజమహేంద్రవరం వచ్చేసరికి కాళు లాగేవి. 'శ్రీ రామచంద్రభగవాన్‌కీ జై' అంటూ చినసామిగారి దగ్గర కెళ్లి దణ్ణంపెడితే ఫలం దక్కేది. శేరుబియ్యం అణా డబ్బులు సదావర్తి ముట్టేది. పైగా పట్నందాకా పడవమీద రిమార్కుగా వెళ్లడానికీ మళ్లీ రావడానికీకూడా పట్టా పుట్టేది. రైళ్లల్లో లాగా పాపం ఎక్కనూ దిగనూ అవసర ముండేదికాదు. బావాజీల కృతజ్ఞతకు పాత్రులైన వాళ్లల్లో నారయ్యప్పారావు ప్రభువు తర్వాత ఈయనే ముఖ్యుడని చెప్పాలి. బావాజీల సంచారమంటే ఇప్పటి వార్తాపత్రికల్లాంటి వన్నమాట. అందుచేతే ఆయన స్వర్గస్థుడై నలభై సంవత్సరాలైనా, ఆస్తి మూడోతరాని కొచ్చినా ఇప్పటికీ కాలవలమీద తిరిగే పడవల కాయనపేరే కాని ఇంకొక పేరు చలామణీ కాదు.

* * *

ఒకరోజు సాయంకాలం ఏడుగంటలకు చినసామిగారు ఆయన మేడమీద వసారాలో ఇష్టాగోష్ఠిచేస్తూ ఉన్నారు. పడమటివైపు దొడ్లోంచి 'దొంగ దొంగ' అని కేకలు వినబడ్డాయి. ఆయన దిగి వెళ్లేసరికి బంట్రోతులు దొంగను పట్టుకున్నారు. ముందు పడపడ దొంగను వాలుగుబ్బాడేరు. "అమ్మ దొంగముండాకొడకా" అంటూ ఒక బంట్రోతు కర్రఎత్తేడు. దొంగ కెక్కడలేని రోషమొచ్చింది. గభాలున చెయ్యి అడ్డంపెట్టి కర్రపట్టుకున్నాడు. 'ఎవర్రా దొంగ, మీరు దొంగలు. ఆకల్తో చచ్చేవాడికింత అన్నం

కట్టుకొని పెద్దమనుష్యులంతా దొంగలు. జాగ్రత్త! మాట వినిలేదో మర్యాద దక్కదు.' అని గుడ్లెర్రచేసి చూస్తున్నాడు. ఆ మాటలు చినసామిగారి చెవుల్లో పడ్డాయి. జులుముకు సిద్ధమవుతున్న బంట్రోతులను వెనక్కి తగ్గించాడు. దొంగ మాటలు ఆయన హృదయంలో శూలాల్లా గుచ్చుకున్నాయి. వాడిముఖంకేసి తేరి పారి చూచాడు. దొంగ వాలకంచూస్తే ఆయనకేవో పెద్దింటి లక్షణాలు కనబడ్డాయి. అతడేదో గొప్ప చిక్కులోఉన్నట్లు ఆయనకు తోచింది. దొంగతనాని కొచ్చేవాడీ వేళప్పుడెందుకొస్తాడని సంశయంతోచింది. గుంట కళ్లూ వాడిపోయిన ముఖమూ చూచి చెయ్యిపట్టుకుని "ఏమిరా, ప్రొద్దున్నుంచీ అన్నం తిన్నావా" అని అడిగేడు చినసామిగారు.

"ప్రొద్దున్నుంచీకాదు. నిన్న ప్రొద్దున్నుంచీ తినలేదు. అన్నం తింటే ఇక్కడికెందుకూ రావడం" అన్నాడు దొంగ.

చినసామిగారిగుండె నీరైపోయింది. వాడు దొంగతనానికొచ్చిన మనిషనే సంగతి ఆయన మరచేపోయాడు. తిన్నగా పడమటింటి వసారాలో కూచోపెట్టి స్వయంగా విస్తట్లో అన్నంవడ్డించి తినమన్నాడు. దొంగ తెల్లబోయాడు. నిశ్చేష్టుడైపోయాడు. ఆయనముఖంకేసి చూస్తూ రెండు కన్నీటిచుక్కలు జారవిడిచాడు. 'తినుతిను' మంటున్నాడు చినసామి. దొంగకీ ఆదరణచూస్తేనే కడుపునిండి పోయింది. ప్రపంచంలో తనలాంటి వాళ్లను ఆదరించే మనుష్యు లింకాఉన్నారని తెలిసేసరికే రెండు నాళ్ల ఆకలీ ఎగిరిపోయింది. చినసామిగారి బలవంతంమీద సుష్టుగా భోంచేశాడు.

భోజనమైన తర్వాత చినసామిగారు దొంగను మేడపైకి తీసుకెళ్లేరు. కూడా ఎవర్నీ రానీయలేదు.

"అబ్బాయీ, నీసంగతంతా చూస్తే చిత్రంగానేఉంది. నీవాలకం నిజంగా దొంగతనానికొచ్చినట్లు లేదు. నీ చరిత్ర ఏమిటో చెప్పు" అని అడిగేడు దొంగని. భోజనంతోనే సగం లొంగిపోయాడు దొంగ. ఇల్లా ఆప్యాయంగా అడ్గడంతోటే మిగిలిన సగంకూడా లొంగిపోయ్యాడు. దొంగ వెక్కి వెక్కి ఏడ్వడం మొదలెట్టేడు. చినసామిగారు ఓదార్చి సంగతేమిటో చెప్పమన్నాడు. దొంగ 'క్షమించండి' అంటూ ఆయనకాళ్లమీద పడ్డాడు............

"బాబయ్యా! క్షమించండి. పొరపాటుపడ్డాను. మీ ముఖం చూసేవరకూ నేను ఈసంఘాన్ని, మేడల్లోనూ మిద్దెల్లోనూ ఉండే పెద్దమనుష్యుల్ని అసహ్యించుకొంటున్నాను. వాళ్లనాశనం కోరింది నా హృదయం. ఇంకా మీ పోటివాళ్లున్నారనే సంగతి నాకు తెలియదు. అపరాధం..." అంటూ ఇంకా చెప్పబోతూంటే చినసామిగారు మాటకడ్డొచ్చాడు.

"అబ్బాయీ అసలు నీ ఊరేదో పేరేదో కథేమిటో చెప్పు." అన్నాను.

"అయ్యా, నాపేరు పడాల వెంకట్రామన్న. అంతా వెంకన్నంటారు. కులానికి కాపులం. అసలు కాపురస్థలం ధర్మారం జమీందారీలోని నరసయ్యపాలెం. ఆరేళ్లనుంచీ, నిన్న మధ్యాహ్నం పన్నెండుగంటలుదాకా రాజమండ్రీ జైలు నా కాపురం. జైల్లోంచి వచ్చిన వాడిననడంతోనే ఇతర పెద్దమనుష్యుల్లాగే మీకూ [illegible]స్తే నేనింకేమీ చెప్పనే అక్కరలేదు."

"వెంకట్రామన్నా, సందేహించకుండా నీగాథంతా చెప్పు. జైల్లో ఉన్నవాళ్లంతా దొంగలూ కారు; బైటున్న వాళ్లంతా దొరలూ కారు. నీసంగతేమీ దాచకుండా చెప్పు." అన్నాడు చినసామిగారు.

"అంతే లెండి బాబూ. మా పడాలవారి కుటుంబం ధర్మారం జమీలోకల్లా హోషుగా బ్రతికిన కుటుంబం. మా బాబు ఊరికి పెత్తందారు, పరగణాకి పెద్ద. దివాణంలో కూడా అతగాడిమాటకు తిరుగులేదండి. ఆయన పోయిన తర్వాత సంసారంలో పెద్దనవడం చేత పెత్తందారీ నాకొచ్చింది. నేనైనా బాబయ్య పేరుకేమీ అప్రతిష్ఠ లేకుండానే కాలం గడిపేను. నాకూ చిన్నతనమైనా ఏదో గౌరవంగానే ఒకదశ గడిచిపోయింది. మా దురదృష్టం కొద్దీ మా నాటున వరుసగా నాలుగేళ్లు వర్షాలు [illegible] పట్టాయి. దాంతో దారుణమైన కాటకం [illegible].

పంటలు పోయాయి. పైగా సంసారం పెరిగిపోయింది. పాటుబడేవాళ్ల సంఖ్య తగ్గిపోయింది. దాంతో మా వ్యవహారం లుకసానులో పడింది. జమీందారుకు రెండువేలు దాకా శిస్తు బకాయిపడ్డాం. పిల్లల పెళ్లిళ్ల బాపతు సాహుకారు ఋణం 5 వేల రూపాయలూ తడిసి మోపెడైంది.



చాలాకాలం దాకా ఎప్పటికైనా మంచిరోజులు రాకపోతాయా అని నీటికెదురీదేం. పైసా కరవయ్యేసరికి పలుకుబడి కొరవైంది. డబ్బున్నంత కాలం మమ్మల్ని బుజ్జగిస్తూ వచ్చిన జమీందారు మెల్లిగా జారవిడిచేశాడు. చెరుకు పిప్పినూ నేసినట్లూ నేశాడు. కాలాంగితే గంగా నమ్మకీ లోకువే. బాబయ్యా ఏగోడవొచ్చినా కాళ్లా వేళ్లా పడి బ్రతిమిలాడే సాహుకారు యేకు మేకైపోయ్యాడు. డబ్బుకోసం తొందర చెయ్యడం మొదలెట్టేడు. మొత్తం మీద మా సంసారంగుట్టు వీధిలో పడింది. మా స్థితిల్లా ఉండగా జమీందారుకీ రైతులికీ భేటీ వచ్చింది. అయిదారేళ్లనుంచి పంటల్లేకశిస్తు డబ్బులు బకాయి పడేసుకు మేముంటే జమీందారుడు అదనప్పన్ను కట్టుకోమన్నాడు. తనకొడుకు సీమలో చదువుకోడాని కెడితే ఆయనకయ్యే అదనం ఖర్చు మానెత్తి మీదెయ్యడం ఏమి న్యాయమో చెప్పండి. తాడూ బొంగరంలేని రైతుల్ని కొందరిని చేరదీసి మాయనాటకం ఆడించాడు. కొన్నాళ్లు. మా జమీందారి చాలా చిన్నది. రెండేవూళ్లు; శిస్తుమాత్రం ఎనభైవేలుదాకా చెల్లుతుంది.”

“మా పరగణా రైతులంతా శివరాత్రి ప్రభల తీర్థానికి మా ఊరొచ్చేరు. ఆవేళ అంతాకూడబలుక్కున్నాం అదనపు పన్నిచ్చుకోలేమనీ, బకాయిలో నాలుగోవంతుకన్న చెల్లించుకోలేమనీ బకాయిమీద పావులా వడ్డీకన్న ఇచ్చుకోలేమనీ జమీందారుగారితో ఖుద్దున మనవిచేసుకోవాలని నిశ్చయించుకున్నాం. మేం చెప్పుకోవలసిన మాటల్ని వినకుండానే ఆయన మామీద కారాలు మిరియాలు నూరేడు. అదనప్పన్ను కట్టుకోని వాళ్లమీద బకాయికి దావావేసి ఆస్తుల నమ్మిస్తానన్నాడు. అందులోనూ పెద్దలుగా ఉండే వాళ్లని మట్టంచేస్తానని బెదిరించాడు బాబయ్యా. అందరికన్నా, నేనే ఇదంతా చేస్తున్నాననీ, నన్ను తలెత్తకుండా చేస్తాననీ శపథం పట్టేడు. ఏం చెయ్యడానికీ తోచక ఇంటికొచ్చేం. రైతులంతాకూడ పలుక్కుని ఒక్క తాడుమీద నడవడానికి నిశ్చయించుకున్నాం.”

“కొన్ని రోజులకి జమీందారీ ఇలాకా సముద్దారుడు బంట్రోతులూ వచ్చి జప్తీలు ప్రారంభించారు. [illegible]నా

సాఫీగా చేస్తే పేచీలేనేలేదు. ఘుమ్మాలు తవ్వించీ, చెంబూ తప్పేలాలు వీధిలో పారేయించీ నానాహంగామా చేసేరు. రైతోళ్లకి ముందొచ్చే కష్టాలు తెలవ్వండి. ఆ హంగామా చేసేసరికి వళ్లుమండి జమీందారు తాలూకు మనుషుల్ని పచ్చడికింద కొట్టేరు. సముద్దారుగారు చెయ్యి విరగగొట్టుకుని కాలికి బుద్ధిచెప్పేరు. జవాన్ సాయేబుకు మక్కలిరిగేయి. తరువా తేమనుకుంటే ఏమి?”

“తరువాత జరిగే తంతంతా జరిగింది. మా వూళ్లలో తలెత్తుకు తిరిగే పన్నెండుమంది రైతులమీద దొమ్మీ కేసు పెట్టేరు. నేనే ఈదొమ్మీకంతా వత్తాసని నన్నుకూడ చేర్చేరు. చేర్చడమేమిటి? మొదటిముద్దాయి నే నేను.

కేసు విచారణైంది. రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువా బాబూ? నాకు ఇంకో ఇద్దరి పెద్దలకు ఆరు సంవత్సరాలు శిక్షేశారు. మిగతా వాళ్లకి సంవత్సరం”

♦ ♦ ♦

“బాబూ జైళ్లల్లో నే పడ్డబాధ పరమేశ్వరుడి కెరుక. గానుగలాగేను. పండంటి వరన్నం తినేవాడిని జొన్నకలి తిన్నాను. సంవత్సర మయ్యేసరికి జైలుకి పనబడిపోయాను. అక్కడి కక్కడ సుఖంచేసుకుని కాలం తోసేస్తున్నా బాబయ్యా. అంతటితో నా కష్టాలు గట్టెక్క లేదండి. నాతో పెద్దశిక్ష లడ్డవాళ్లే జైళ్లల్లోకో పోయారు. ఊళ్లో పండంటి పడాలవారి సంసారం పాడైపోయింది. ఆస్థి అంతా జమీందారూ సావుకారు పంచుకున్నారు నా పెండ్లాం, పూవులమ్మిన ఊళ్లో కట్టెలమ్మలేక నల్లమందూ నూనే తాగి చచ్చిపోయిందండి. పమిడి పళ్లల్లాంటి పిల్లలు చూచే దిక్కులేక క్షయవ్యాధిచేత చచ్చిపోయారు. ఊళ్లో గడవక అన్నదమ్ము లాళ్లంతా చెట్టూ పుట్టాపట్టి పోయారు. వాళ్ల అతీగతీ నాకు తెలియదు. మొదటి రెండేళ్లపాటు నాకు ఉత్తరాలొస్తూవుండేవి. నాలుగేళ్ల నుంచీ అవీలేవు. ఆ ప్రక్కనుంచొచ్చే ళ్లెవరినడిగినా ఏమీ ఆనోకీ ఇవ్వలేదు. బాబయ్యా శవం మీద ఎన్ని బల్లేడితే నేమండి? (దొంగగుడ్లంబడి నీళ్లు జలజల రాలేయి) ఒక కష్టానికేడవగలం కాని ఒకదానిమీద ఒకటి పడితే ఏమేడ్వగలం? ఎప్పటికప్పు డొక్క ఏడు పేడ్చేసి గుండెరాయి చేసుకున్నాను. ఒక్కటిమాత్రం నిశ్చయం చేసుకున్నా. ఇక నరసాయపాలేనికి నాకు ఋణం చెల్లిపోయిందని ఆపొలిమేర తొక్కకూడదని ఒట్టుపెట్టుకున్నా. బాబూ, ఇప్పటికీ ఆఊరు పేరు తలుచుకుంటే గుండె చెరువైపోతోందండి. జైల్లో పేమల్లే పని పసందుగా నేర్చుకున్నానండి. ఈపని చేతిలో ఉంది కనుక ఒక్కపొట్ట కేలాగైనా గుప్పెడు మెతుకులు దొరక్క పోతాయా, గౌరవంగా కాలక్షేపం చెయ్యలేక పోతామా అనుకున్నాను. పురాణగాధలు చదువుతో మనస్సు సంతృప్తి పరుచుకున్నాను.”

♦ ♦ ♦

గడువు గడిచిపోయింది. నిన్న మధ్యాహ్నం ఆ గోడల ప్రపంచం విడిచి ఈ విశాల ప్రపంచంలో పడ్డాను. బత్తెంకోసం ఇచ్చిన ఆరుఅణాలు డబ్బులు, ఆరేళ్లనాటి ఈకట్టు గుడ్డలూ తప్ప ఘరేమీలేదు నాదగ్గర జైలు గుమ్మందాటి ఇవతలి కొచ్చేసరికి వార్డరయ్యల ఈనాము క్రింద నాలుగణాలు శలవైపోయింది. రెండణాలతో రోడ్డుమీద కొచ్చేసరికి పోలీసులు వెనకపడ్డారు. ‘ఏవూ రెడతావు? ఎప్పుడెడతావు? ఎక్కడుంటావు?’ అని అడుగుతారు. ఎక్కడి కెళ్లాలో నాకే తెలియనప్పుడు నేను వాళ్లకేం చెప్పను? ఈవేళకి సత్రంలో ఉంటాననీ రేపటి సంగతి చెప్పలేననీ చెప్పేను. వాళ్లకి అనుమానం మరీ ఎక్కువైపోయింది. సాయంత్రం దాకా వీధుల్లో తిరిగేను. చేతిలోవున్న డబ్బులు ఖర్చుపెట్టి పొంగరాలు కొనుక్కున్నా. అరణా చుట్టలుకొని స్వేచ్ఛగా కాల్చుకున్నా. రాత్రి ఎక్కడా అని ఆలోచించా. ఎవరిదో అరుగుమీద పడుకున్నా. పోలీసులొచ్చి ఆయనతో ఏదో చెప్పేరు. అంతటితో ఆయన నన్నక్కడ నుంచి లేవగొట్టేడు. గోదావరొడ్డున సత్రం అరుగుమీద పడుకున్నా. మళ్లీ పోలీసులు సిద్ధం. గుమాస్తా అక్కడనుంచి లేవగొట్టేడు. గోదావరి వడ్డున చీడీలమీద పడుకున్నా చలికి వణుకుతూ. ఆ గంగమ్మతల్లికి మాత్రం నామీద కోపం రాలేదు. తెల్లవారింది. గంజివేళైంది. కడుపులో మండుతోంది. కూడుతిన్నావా’ అని అడిగే నాధుడు కనబడలేదు. పెట్టివున్నంత పెట్టేవాళ్లుండక పోతారా

అని తిన్నగా రోడ్డుమీద కొచ్చాను. ఒక ఇంటికెళ్లి అన్నం పెట్టించమని స్థితంతా చెప్పేను. ఆయన పెద్ద వైద్యుడుట బాబూ. దొంగ లిల్లాగేవచ్చి చూచి పోయి రాత్రి కన్నం వేస్తూ ఉంటూ. పోపో!" అనితరమేశాడండి. అక్కడనుంచి అదిగో ఆ ఉత్తరపు వీధినున్న పెద్ద మేడప్లీడరుగారింటికెళ్లి నా స్థితంతా చెప్పుకున్నాను. ఆపూటకింత అన్నం పెట్టించి ఏదైనా కూలిపనిస్తే పడుంటానని మనవిచేసుకున్నా. పేముపని బాగా చెయ్యగలగననీ పనిప్పిస్తే చేస్తాననీ చెప్పేను. ఆయన పెదివి చప్పరించేశాడు. పనిచేస్తాన నిల్లాగే ప్రవేశిస్తారు దొంగముండా కొడుకులు. ఉన్నట్టేవుండి ఏ వెండిగిన్నో చంకనెట్టుకు పోతారు. అయినా జైలునుంచొచ్చిన దొంగ - నెల్లాగ నమ్మడం? వెళ్లు" అన్నాడు ప్లీడరుగారు నేను దొంగను కాననీ ఒకప్పుడు పెద్ద సంసారంలో వాడినే అని, కాలం తప్పి ఇట్లాంటవస్థ వచ్చిందనీ చెప్పుకున్నాను. కాని ఆయనకేమీ నచ్చలేదు. 'అబ్బే' దొంగామనిషిలాంటి వాడే, కబుర్లిల్లాగే చెపుతారు' అని చక్కా పోయాడు.

అప్పటికే 11 గంటలు దాటింది కాళ్లులాగి అరుగుమీదే కూచున్నాను.

'ఏమిక్కడే కూచున్నావు? పోలీసుల కప్పచెప్పాలా ఏమిటి?' అన్నాడు ప్లీడరుగారి గుమాస్తా.

మీరంతా దొంగలుకారయ్యా అమాయకుల్ని దోచే మీకన్న దొంగలెవరున్నారు అని అందామనుకొని ధైర్యం చాలక మళ్లీ వీధులో పడ్డాను. ముష్టెత్తడం నాచేతకాదు. అయినా రాయిలాఉన్న నేను ఏమనీ ముష్టెత్తను? పని ఇచ్చేవాడు లేకపోయినా 'దున్నపోతులా ఉన్నావు. ఏదైనా కష్టపడకూడదూ?' అంటారు. కాలమెల్లా వెడుతుందో తోచలేదు. ఆరుసంవత్సరాలనుంచీ చీకూ చింతా లేకుండా వేళకేదో కలో గంజో పడుతోంది. కడుపులో ఏమనేవాళ్లు లేకుండా చీకటి పడేసరికి నాకొట్లో నేను పడుకుంటున్నాను. కృష్ణా రామా అనుకుంటూ కాలక్షేపం చేశాను. అక్కడున్నన్నాళ్లూ బయట ఏదో మహాస్వర్గం ఉందనుకున్నాను. కాని అస్వర్గమేదో తేలిపోయింది. ఈ ప్రపంచం కటికి ప్రపంచం. 'నా కైశ్వర్యం నాకారోగ్యం' అనేవాళ్లేకాని పరాయివాడి గతి చూచేవాళ్లిక్కడ లేనేలేరు. జైలే నయం పొట్టకోసం, బట్టకోసం, నిలువడానికి నీడకోసం దేవులాడవలసిన ఈ ప్రపంచం కన్న గోడలమధ్య నున్న ఆ ప్రపంచమే బాగుందనిపించింది. ఇక్కడ ఎంతసేపూ ఈతడుముళ్లాటే కాని దేవుడు లేడనిపించింది.

మళ్లీ గోడల ప్రపంచంలోకే చేరడానికి స్థిరపరచుకున్నా. నిత్యం పొట్టకోసం తడుముకోడంకన్న అందులో ప్రవేశించడానికి ఒక్కసారి మార్గం తడుముకుంటే చాలనిపించింది. మార్గమేమా అని ఆలోచించా, కడుపులోమంటే దారిచూపించింది. ఎవరింటోనో ప్రవేశించి అన్నం తిందామనుకున్నాను. పట్టుపడతానా కేసుపెట్టి జైల్లోపెడతారు. లేకపోతే ఈపూట కాకలి తీరుతుం దనుకున్నాను. ఈరోడ్డంట వస్తుంటే మీయింటిమీద పడిందికన్ను గభాలున. ఎగిరి జామచెట్టుకొమ్మందుకుని పైకెక్కి దొడ్లోకి దూకేను. వడమటింట్లోకెళ్ల బోయేసరికి మీ జవానులు పట్టుకున్నారు. ఇది బాబయ్యా నాగాధ. తరువాత మీచిత్తం. నన్ను మళ్లీ త్వరగా జైలుకంపే ఏర్పాటుచేస్తారా మీకు వెయ్యిదణ్ణాలు వెడతాను."

ఈ గాధంతా విన్న చిన్నస్వామిగారి హృదయం కరిగి నీరైపోయింది. వెంకట్రామన్న గాధంతా ముగ్ధుడై విన్నాడు. అతనుచెప్పినదంతా నిజమేనా అనిపించిం దొక్క ఘడియ. సందేహమేముంది. ప్రపంచంలో ఎవడి దేవులాట వాడిదేకాని ఇతరులసంగ తెవడుచూస్తున్నా డనుకున్నాడు. కన్నీరు కార్చేడు. ఇల్లాంటి అభాగ్యులింకా ఎందరున్నారో కదా అనిపించిం దాయనకు.

"అబ్బాయీ, వెంకన్నా మళ్లీ జైలు కెళ్లకు. నీకేదో ఏర్పాటు నేచేస్తాను. నాయింట్లో ఉంటావా?" అని అడిగేడు.

"వద్దండిబాబూ మీరింతమాట శలవివ్వడమే గొప్ప. ఇంకా మీలాంటివాళ్లుండడంవల్లే ప్రపంచం ఇంకా ఇంత మాత్రంగా ఉంది. మీకు కోటిదణ్ణాలు కాని బాబయ్యా అంతా మీలాంటివాళ్లుండరు. ఎవరికి ఏ అనుమానం కలిగినా

నామీద కొస్తుంది. నేను తర్వాత చిక్కు పడాలసొస్తుంది. దయచేసి జైల్లోకే పంపండి.”

అబ్బాయీ, నామాటవిను. నీకథంతా విన్నాక నిన్ను జైల్లోకి పంపి నేను పాపం కట్టుకోలేను. నాఇంట్లో ఉండడం ఇష్టంలేకపోతే నా పడవమీదుండు. నెలకి అయిదు రూపాయలు జీతం, దినభత్యం ఇస్తాను. నీవిషయం నాకు పూర్తిగా నమ్మకమే. అన్నాడు చినసామిగారు. వెంకట్రామన్న ముందు సందేహించాడు. కాని ఇటువంటి దీనదయాళునిమాట తీసేయలేక పోయాడు. మర్యాదగా బ్రతకనిస్తే ఎక్కడైతేనేమిటని పడవమీద పనికి కుదిరేడు.

*　　　*　　　*

పడాల వెంకట్రామన్న ఉండీ కాలవను తిరిగే ‘మహాలక్ష్మమ్మ’ పడవకు సరంగు. రాధాళిపడవల్లో సరుకు తరిగిపోతూ ఉండడం సామాన్యవిషయం. బియ్యంబస్తాకు తవ్వెడో మానెడో తరుగు తప్పదు. కొబ్బరికి బస్తాకు రెండుకాయలు తరుగు. వెంకన్న (అంతా అతని సరంగు వెంకన్న అని పిలిచేవారు) సరంగైన తర్వాత ఇల్లాంటి తరుగులు లేవు. లోపాయికారీ వ్యవహారాలమాట అతనితో చెప్పకూడదు. కళాసులు అతనిపేరు చెపితే గజగజలాడేవారు. ఆకాలవని సరుకేసే వర్తకులంతా వెంకన్న పడవ వంతొచ్చేవరకూ ఆగేవారు. వెంకన్నకు సాలీనా వర్తకులిచ్చే బహుమతులన్నీ కళాసులకు పంచిపెట్టేసేవాడు. అతనికి పడవే ఇల్లు. కళాసులే కుటుంబం. నెలజీతం హుజూరులోనే నిలవుండేది.

చినసామిగారు స్వర్గస్థులైన తర్వాతకూడా చాలా కాలం పనిచేశాడు. వెంకన్న మొత్తం ఇరవై ఏళ్లు చాకిరీ చేసి పడవమీదే ప్రాణం విడిచాడు. హుజూరులో నిలవున్న వెయ్యిరూపాయలు పైచిల్లర జైల్లోంచి విడుదలయ్యే ఖైదీల సహాయ్యంకోసం ఖర్చుపెట్టమని చెప్పి చచ్చిపోయాడు.

---


## చిరకాలమునుండి బాధించుచున్న మూత్రవ్యాధులకును శెగ (గనేరియా) వ్యాధికిని క్రొత్తగా కనిపెట్టబడిన దివ్యౌషధము

# గొనో కిల్లర్ (రిజిష్టర్డు)

కృత్రిమములకు జాగ్రత్త
“కోడి మార్కు”ను చూసి
కొనుడు

ఈ ఔషధము ఇంగ్లీషు మందులను దేశీయ ఔషధములను పుచ్చుకొనినను గుణము కలుగనియెడలను, యింజక్షనులవలనను, వాక్సీనులవలనను గూడ లాభములేక పోయినయెడల, కడపటి ప్రయత్నముగా మా గొనోకిల్లరునుగూడ పుచ్చుకొని చూడుడు. మూత్రము ఝరీగా వెడలును. మూత్రము పోవుచున్నపుడు కలుగు మంట తగ్గిపోవును. మూత్రనాళమునందలి వాపు తీసిపోవును. మూత్రము బొట్టుగా పడుట, మేహరోగమువలన మూత్రద్వారము నుండి పోవు తెలుపు, మూత్రద్వారముయొక్క వాపు, నరముల జబ్బు మున్నగు వ్యాధులన్నియును స్త్రీలకును పురుషులకునుగూడ గొనోకిల్లరువలన కుదురును. ఖరీదు 50 మాత్రలుగల సీసా రు. 3—0—0. కృత్రిమములు చూచి భ్రమజెందవలదు.

మా పుంజుమార్కు గమనింపుడు. వి. పి. చార్జి ప్రత్యేకము. అడ్రెసు:—డాక్టరు డి. యన్. జస్సాని

Dr. D. N. JASANI, Girgaum Back Road, Bombay 4 • గిర్‌గామ్ వెనుకరోడ్డు, బొంబాయి

Madras Agents:—DADHA & CO., Nainiappa Naick St., P. T., Madras